నన్నగా నవ్వి "వీరు రెవిన్యూబోర్డు మొదటి మెంబరు నీల కంఠన్‌గారు. వీరు మ్యునిసిపల్ కమీషనర్ ప్రేమ్‌చంద్ గారు. వీరు డిప్యూటీ డైరెక్టరు కామేశంగారు" అంటూ ఒక్కొక్కర్నీ పరిచయం చేశాడు.

శ్యామసుందరం నా చేతులను తన చేతుల్లోకి తీసుకుంటూ "ఇంకొకర్ని పరిచయం చేయాలి మాస్టారూ! మిస్టర్ జేమ్స్, ఇలా రండి. వీరు సుప్రసిద్ధ కళా విమర్శకులు. పత్రికల్లో ఆర్ట్ మీద వీరి వ్యాసాలూ అవీ మీరు చూసే ఉంటారు. మేమిద్దరం చిన్నప్పుడు ఒకచోట చదువుకున్నాం" అంటూ తెల్లగా, పొడుగ్గా ఉండి, నోట్లో పైప్ పెట్టుకొని, దూరంగా కన్పిస్తున్న కొండలవేపూ, పైన పరుగెత్తుతున్న మబ్బులవేపూ చూస్తున్న ఒక లావుపాటి మనిషిని నాకు పరిచయం చేశాడు. నిజానికి నాకు కళనుగురించి ఏమీ తెలీకపోయినా, ఆయన పేరు ఎప్పుడూ వినకపోయినా, అంతమంది పెద్దమనుషుల ముందు వెలితిపడడం ఇష్టంలేక, నా తెలియనితనాన్ని చిరునవ్వుతో కప్పేసి ఆయనతో గాఢంగా కరచాలనం చేశాను.

ఆ తర్వాత ఆయన నావేపు తిరిగి "ఇంత అందమైన దేశాన్ని ఇరవై సంవత్సరాల క్రితం వొదిలిపెట్టాను" అన్నాడు.

"పోనిలెండి. శ్యామసుందరంగారి వివాహం మూలంగా నైనా మళ్ళీ వచ్చారు" అన్నాను, ఏదో ఒకటి మాట్లాడకపోతే బాగుండదని

"కృష్ణమూర్తి గారూ!"

నేను ఉలిక్కి పడ్డాను. శ్యామసుందరం నా కళ్ళవేపే చూస్తూ మాట్లాడుతున్నాడు. "మీరు వెళ్ళి కళ్యాణి నిక్కడికి తీసుకురండి. జేమ్స్ అసంతృప్తితో వెళ్ళిపోతే, నాకు చాలా బాధ కలుగుతుంది."

ఈ మాటలు వినగానే విషాదంగా ఉన్న జేమ్స్ మొహంలోకి ఒక్కసారిగా కళవచ్చింది. కుర్చీలోకూర్చున్నవాడల్లా లేచివచ్చి నా చేతులు పట్టుకుడున్నాడు. "ప్లీజ్! అట్లా చేయండి. నాకు టైమూ కలిసొస్తుంది; మనసుకు తృప్తిగా ఇక్కడనుంచీ వెళతాను."

రెవిన్యూబోర్డు మొదటి మెంబరు నీలకంఠన్‌గారు తలాడించారు. మ్యునిసిపల్ కమీషనర్ ప్రేమ్‌చంద్‌గారు నావేపు ఆతృతతో చూశారు. నేను జవాబు చెప్పటానికి తటపటాయిస్తున్నాను. కలెక్టరు శ్యామసుందరం నా సందేహాన్ని గుర్తించాడు. "ఈపని మీరు చేయాలి. ఇప్పుడు మాష్టారూ వెళ్ళిరండి" అన్నాడు. కలెక్టరు శ్యామసుందరం కంఠంలో ఉన్న ఆజ్ఞ నన్ను విచలితుణ్ని చేసింది. పదిహేనేళ్ళుగా చేస్తున్న నా అధ్యాపకత్వ దర్పమంతా అతనిముందు వెలవెలబోగా, మౌనంగా తల వూపి, ఆ విడిదిలో నుండి బయట పడ్డాడు.

నామీద చాలా తమాషా అయిన భారమే మోపబడ్డది. దీన్ని ఎలా విజయవంతం చేయడమో ఆలోచన సాగడంలేదు.

## 2

"ఇదమ్మా అసలు విషయం" అంటూ సంగతంతా వివరించిన తర్వాత, నా ప్రయత్నం విజయవంత మవుతుందో కాదో అన్న సందేహంతో ఆమె మొహంలోకే పరీక్షగా చూడసాగాను. ఆమె నొసటన దిద్దిన కళ్యాణ తిలకమూ, బుగ్గన పెట్టిన చాదు చుక్కా ఆ నీరెండలో నూత్న సోయగాలను సంతరించుకొంటున్నాయి. మల్లెపూల వాలుజడ వేసుకుని నా ఎదుట నిలబడ్డ నా విద్యార్థిని కళ్యాణి నా అవస్థ చూసి జాలిపడినట్లుగా సన్నని చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వుతో కొండంత ధైర్యంతో "అయితే ఒప్పుకున్నట్టే కద కళ్యాణీ?" అని మళ్లీ అడిగాను. కళ్యాణి నావేపు చూసి అన్నది. "మీరు చెప్పిన మాటను నేను ఎప్పుడు కాదన్నాను మాష్టారూ! ఎప్పుడూ మీరు నా శ్రేయస్సునే కోరుతుంటారని నాకు తెలుసు."

నేను బరువుగా నిట్టూర్చాను. "చదువుకున్నదానివి, పరిస్థితి నర్థంచేసుకున్నదానివి తల్లీ!" అని కొంచెంసేపు ఆగి "మరి బయల్దేరుదామా అమ్మా?" అని అడిగాను.

కళ్యాణి లోపలకు వెళ్ళి ఒకటి, రెండు నిమిషాల్లో తయారై బయటకు వచ్చింది. నేనూ, నవవధువు కళ్యాణి గుమ్మం దాటబోతున్నాం. అక్కడే ఆరుబయట పడక కుర్చీలో పడుకుని ఉన్నారు కన్యాదాత, ప్రిన్సిపాల్ రాజ

